# మూడు రోజుల్లోనే 130 ఫోన్లు రికవరీ

- ఎస్పీ రాజేశ్‌చంద్ర
- రూ.20 లక్షల విలువైన మొబైల్ ఫోన్లు స్వాధీనం

కామారెడ్డి, మే 9 : స్పెషల్ డ్రైవ్ ద్వారా 130 ఫోన్లు రికవరీ చేసినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం సెల్‌ఫోన్ పోగొట్టుకున్న, చోరీకి గురైన ఆందోళన చెందవద్దని, సీఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని తెలిపారు. సుమారు రూ.20 లక్షల విలువైన 130 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించినట్లు తెలిపారు. సెల్‌ఫోన్ల రికవరీ కోసం ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఒక ఆర్‌ఎస్‌ఐ 10 మంది కానిస్టేబుళ్లతో ప్రత్యేక టీం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మూడు రోజుల్లో ఈ టీం అధికారులు 130 ఫోన్లను రికవరీ చేశారని తెలిపారు. ఫోన్ల రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన టీం సభ్యులను అభినందించారు. పోగొట్టుకున్న ఫోన్ బాధితులు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఆర్‌ఎస్ఐ బాలరాజ్‌ను సంప్రదించి ఫోన్‌కు సంబంధించిన వివరాలు చూపించి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.


పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను చూపిస్తున్న అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి

## విద్యార్థి కుటుంబానికి అండగా ఉంటాం


బాధిత విద్యార్థి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

లింగంపేట, మే 9 : లింగంపేట మండలం నల్లమడుగు పెద్ద తండాకు చెందిన అర్చన కుటుంబానికి ఆండగా ఉంటానని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజల సురేందర్ స్పష్టం చేశారు. నల్లమడుగు పెద్ద తండాకు చెందిన అర్చన గత నెల 30వ తేదీన హైదరాబాద్‌లో ప్రవేశ పరీక్షలు రాసి నల్లమడుగు తండాకు తిరిగి వస్తున్నది. మార్గమధ్యలో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొనడంతో అర్చన అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తండాకు వెళ్లి తల్లిదండ్రులను ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు దివిటి రమేశ్, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, నల్లమడుగు పెద్ద తండా మాజీ సర్పంచ్ రవీందర్‌నాయక్‌తోపాటు నాయకులు ఉన్నారు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


బాన్సువాడ ప్రభుత్వ మాతా శిశు దవాఖానలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

బాన్సువాడ, మే 9 : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని టాస్క్ ఫోర్స్ ఫుడ్ సేఫ్టీ అధికారిణి సునీత సూచించారు. బాన్సువాడలోని వంద పడకల మాతాశిశు దవాఖాన, ప్రభుత్వం ఏరియా దవాఖానలో రోగులకు ప్రతిరోజూ అందించే భోజనాన్ని శుక్రవారం వారు పరిశీలించారు. వంటతయారు చేసే క్యాంటిన్ లో సామన్లను పరిశీలించారు. ఉదయం అందించే టిఫిన్, పాలు, భోజనం ఆకుకూరలు, కాయగూరలు, మధ్యాహ్నం గుడ్డు, ఆరటిపండు, మజ్జిగను క్రమం తప్పకుండా మెనూ ప్రకారం అంధించాలని సూచించారు. వంటశాలలో శుభ్రత పాటించాలని, రోగులకు నుంచి భోజనం అందించడంలో ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంసీహెచ్ దవాఖానలో భోజనం అందించడంలో జాగ్రత్తలు తీసుకోవాలని, మెనూలో ఉన్న విధంగా మూడు పూటల భోజనాన్ని ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీసీహెచ్ ఎస్ డాక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య, ఆర్ఎంవో సుజాత, హెడ్ నర్సు ఆరోగ్య జ్యోతి, దవాఖాన సిబ్బంది లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి అదృశ్యం

ఎల్లారెడ్డి రూరల్, మే 9 : ఎల్లారెడ్డికి చెందిన షేక్ సలీం అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ తెలిపారు. ఈ నెల 4వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన సలీం తిరిగి ఇంటికి రాలేదన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## బాన్సువాడ నుంచి వేములవాడకు బస్సు ప్రారంభం

బాన్సువాడ, మే 9 : బాన్సువాడ నుంచి వయా కామారెడ్డి మీదుగా వేములవాడ వరకు ఆర్టీసీ బస్సు సేవలు ప్రారంభించినట్లు బాన్సువాడ ఆర్టీసీ డీఎం సరితాదేవి తెలిపారు. బాన్సువాడ ఆర్టీసీ డిపో నుంచి శుక్రవారం బస్సుకు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. బాన్సువాడ నుంచి ఉదయం 8.20 గంటలకు బస్సు ప్రారంభం అవుతుందని అన్నారు. 10 గంటలకు కామారెడ్డి, 11.20 గంటలకు వేములవాడకు చేరుకుంటుందని తెలిపారు. తిరిగి వేములవాడ నుంచి 11.40 గంటలకు ప్రారంభమై కామారెడ్డి మీదుగా సాయంత్రం 6.10 గంటలకు బాన్సువాడకు చేరుకుంటుందని తెలిపారు. ఈ బస్సు సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించారు.


బాన్సువాడ నుంచి వేములవాడకు బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీసీ డీఎం సరితాదేవి

## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

కామారెడ్డి, మే 9 : హత్యచేసిన నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.2 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020 జూలై 13వ తేదీన నీరడి ముత్తన్న ఇచ్చిన సమాచారం మేరకు కామారెడ్డి నుంచి నిజామాబాద్ వెళ్లే జాతీయ రహదారి 44 రోడ్డులో కల్వర్టు కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని చెప్పారు. ముఖం, ఛాతి వరకు పూర్తిగా కుళ్లిపోయి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు సదాశివనగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులను విచారించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీ ఫుటేజ్ ఉపయోగించి గోల్కొండ రవికుమార్ అలియాస్ రవి, అలియాస్ రవీందర్‌ను నేరస్తుడిగా గుర్తించి అరెస్టు చేశారు. మృతుడు మాడల సతీశ్‌కు రవికుమార్ 2020 జూలై 10వ తేదీన ఫోన్ చేసి ఇద్దరం కలుద్దామని చెప్పాడు. వారిద్దరూ సదాశివనగర్‌లో కలిసి వైన్స్ దగ్గరికి వెళ్లి మద్యం కొనుగోలు చేసి తాగుతుండగా గొడవ జరిగింది. రవికుమార్‌ను, అతిని భార్యను, భార్య బంధువులను తరుచుగా తిట్టేవాడు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకొన్న గోల్కొండ రవికుమార్ ఎలాగైనా సతీశ్‌ను చంపాలని పథకం వేసుకున్నాడు. ఆర్మూర్ వెళ్దామని నమ్మించి మర్కల్ ఎక్స్ రోడ్ వైపునకు వెళ్తుండగా ఓ కల్వర్టు వద్దకు చేరుకున్నారు. సతీశ్‌ను కల్వర్టు దగ్గర కూర్చొబెట్టి కిందికి తోసేశాడు. దీంతో సతీశ్‌కు గాయాలయ్యాయి.

దీంతో రవికుమార్ కిందకు దిగి రాయితో తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. ఈ విషయంలో సరైన సాక్షాలు సేకరించి, సాక్షాధారులను పరిశీలించగా నేరం రుజువైంది. జిల్లా న్యాయమూర్తి సీహెచ్.వీఆర్ఆర్ వరప్రసాద్ నిందితుడికి జీవిత ఖైదు, రూ.2 వేల జరిమానా విధించారు. పోలీసు తరపున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్‌గౌడ్ ఈ కేసును సరైన పద్ధతిలో విచారణ చేసిన అప్పటి సదాశివనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్, ఎస్సై నరేశ్, ప్రస్తుత సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, ఎస్సై రంజిత్, ఏఎస్సై రామేశ్వర్ రెడ్డి, సీడీవోఎస్ రాజేశ్, సాయిలును ఎస్పీ అభినందించారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి నిప్పపెట్టిన దుండగులను అరెస్టు చేయాలి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సురేశ్

పెద్దకొడప్‌గల్ (పిట్లం), మే 9 : అంగన్‌వాడీ కేంద్రానికి నిప్పుపెట్టిన గుర్తు తెలియని దుండగులను అరెస్టు చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ అన్నారు. పిట్లం మండలంలోని అల్లాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్ సావిత్రిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్ సావిత్రి బుధవారం విధులు ముగించుకొని కేంద్రానికి తాళం వేసి వెళ్లిపోయినట్లు తెలిపారు. వెళ్లిన గంటలోనే కేంద్రానికి గుర్తు తెలియని దుండగులు కిటికీల నుంచి పెట్రోలు పోసి నిప్పు పెట్టడంతో సామన్లు పూర్తి కాలిపోయాయన్నారు. సంఘటన జరిగి రెండు రోజులైనా సంబంధిత సూపర్‌వైజర్ వచ్చి చూడకపోవడం ఆమె నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. పోలీసులు చట్టా రీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించిన ఉన్నతాధికారులు దుండగులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు


బోర్లం క్యాంపులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ముజాహిద్

బాన్సువాడ రూరల్, మే 9 : ఇండ్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఎంపీడీవో ముజాహిద్ అన్నారు. బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపులో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో పాల్గొన్నారు. ఇప్పటికే మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించాలని వారికి సూచించారు. ఇం డ్లు నిర్మించుకునే వారికి విడుతల వారీగా బిల్లులు మంజూరు చేస్తామని చెప్పారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి పరిపూర్ణ, కారోబార్ వినయ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సంజీవ్ రెడ్డి, పిర్యానాయక్, షబ్బీర్, సావిత్రి, సంత్యాలి, గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, చందర్, కిషన్ తదితరులు ఉన్నారు.

## కొనసాగుతున్న ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్లు


తాడ్కోల్‌లో రైతుల వివరాలు సేకరిస్తున్న ఏఈవో రాణి

బాన్సువాడ రూరల్, మే 9 : మండలంలోని తాడ్కోల్ గ్రామ రైతు వేదికలో శుక్రవారం ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్లు చేపట్టినట్లు ఏఈవో రాణి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫార్మర్ ఐడీ గుర్తింపుల జారీ కోసం రైతుల నుంచి వివరాలు సేకరించి నమోదు చేస్తున్నామని తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, పాసుపుస్తకం వివరాలు, భూమి రకం సర్వే నంబర్లు, సాగు చేస్తున్న పంట వివరాలు అందజేయాలని అన్నారు. 11 నంబర్లతో కూడిన ఫార్మర్ ఐడీ ఉంటేనే భవిష్యత్‌లో కిసాన్ సమ్మాన్ నిధి, ఫసల్ బీమా యోజన, హెల్త్‌కార్డులకు అర్హులు అవుతారని తెలిపారు. బోర్లం క్లస్టర్ పరిధిలోని బోర్లం, తాడ్కోల్, బోర్లం క్యాంపు, కొయ్యగుట్ట, జక్కత్‌దాని తండా, బుడ్మి, కొత్తాబాది, తిర్మలాపూర్ గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం


పర్మళ్ల గ్రామంలో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్మన్ రజితావెంకట్రాంరెడ్డి

లింగంపేట, మే 9 : గ్రామంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్మన్ రజితావెంట్రాంరెడ్డి సూచించారు. లింగంపేట మండలం పర్మళ్ల గ్రామంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు పండించిన జొన్నలను దళారులకు విక్రయించొద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు 3,371 రూపాయలు చెల్లించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లింగంపేట సహకార సంఘం చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజు, స్థానిక నాయకుడు నారాగౌడ్, శెట్పల్లి, పర్మళ్ల గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

## బాన్సువాడ డీఎస్పీగా విఠల్‌రెడ్డి

బాన్సువాడ, మే 9 : బాన్సువాడ డీఎస్పీగా విఠల్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా బాన్సువాడ లో ఇది వరకు డీఎస్పీగా విధులు నిర్వహించిన సత్యనారాయణగౌడ్ హైదరాబాద్ కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నల్గొండలో విధులు నిర్వహించిన డీఎస్పీ విఠల్‌రెడ్డి బాన్సువాడకు బదిలీపై వచ్చారు.

## ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

పెద్ద కొడప్‌గల్ (పిట్లం), మే 9 : మద్యానికి బానిసై ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాంపూర్ చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన కమ్మరి రాజు (33) మద్యానికి బానిసై గురువారం రాత్రి 10 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య కమ్మరి సరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మహాత్మా బసవేశ్వర విగ్రహా ఆవిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బిచ్కుంద పీఠాధిపతి సోమయప్ప

బాన్సువాడ రూరల్, మే 9 : బాన్సువాడ మండలం ఇబ్రహీంపేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా బసవేశ్వర విగ్రహాన్ని బిచ్కుంద పీఠాధిపతి సద్గురు సోమయప్ప శుక్రవారం లింగాయత్ సమాజంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12వ శతాబ్దంలోనే స్త్రీ, పురుషులు సమానమని, సంఘంలో దురాచారాలను తరమికొట్టిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. మహాత్మా బసవేశ్వరుడు సూచించిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని అన్నారు. కుల మతాలకు అతీతంగా దేశం కోసం, ధర్మం కోసం పాటు పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీర శైవ లింగాయత్ సమాజం పెద్దలు దేవేందర్, హన్మాండ్లు, అంజు, శంకర్, మల్లికార్జున్, సంగప్ప, భాస్కర్, లింగం, శంకర్, సుదీప్, శ్యాం, గంగాధర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

బిచ్కుంద, మే 9 : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ (అటానమస్) కళాశాలలో 2025-26 సంవత్సరానికి గాను దోస్త్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో బిచ్కుంద కళాశాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ దోస్త్ కోడ్ 5011కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు దోస్త్ కోఆర్డినేటర్ వెంకటేశం, 9492795524 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

## 'ఆపరేషన్ సిందూర్'కు మద్దతుగా ప్రత్యేక పూజలు


భారత సైన్యానికి మద్దతు సిద్ధరామేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భిక్కనూరు, మే 9 : రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయ ఆదేశాల మేరకు శుక్రవారం భిక్కనూరులోని సిద్ధ రామేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ప్రధా న అర్చకులు రామగిరి శర్మ, రాజేశ్వర్ శర్మ ఆధ్వర్యంలో 'ఆపరేషన్ సిందూర్', సైనికులకు మద్దతుగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పాకిస్థాన్‌కు భారత దేశమంటే ఏంటో స్పష్టంగా చెప్పే సమయం వచ్చేసిందని, అందుకే మన సైనికులకు సిద్ధ రామేశ్వర స్వామి వారి అనుగ్రహం, మంత్ర శక్తియుక్తులను ప్రసాదించి ఉగ్రమూకలను తుదముట్టించాలని భగవంతుడిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బందితోపాటు ప్రముఖ న్యాయవాది భిక్షపతి, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

నిజాంసాగర్, మే 9 : మహ్మద్‌నగర్ మండల కేంద్రంలోని సొసైటీ ఫంక్షన్ హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు శుక్రవారం పంపిణీ చేశారు. మహ్మద్‌నగర్ మండలానికి మొత్తం ఇందిరమ్మ ఇండ్లు 250 మంజూరయ్యాయని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మనోజ్‌కుమార్, స్థానిక నాయకులు రవీందర్‌రెడ్డి, కార్యకర్తలు, తహసీల్దార్ సవాయిసింగ్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**విగ్రహం ఆవిష్కరణ**

బిచ్కుంద(జుక్కల్) 9 : జుక్కల్ మండలంలోని హంగర్గ గ్రామంలో కురుమల ఆరాధ్య దైవం బాలు మామ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హాజరయ్యారు. ఆయన జుక్కల్ ఎమ్మెల్యేతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కురుమ కులస్తుల తదితరులు పాల్గొన్నారు.

## బాలు మామను ఆదర్శంగా తీసుకోవాలి


మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండేను గొంగడితో సత్కరించిన కురుమ సంఘం సభ్యులు

బిచ్కుంద(జుక్కల్), మే 9 : కురుమల ఆరాధ్య దైవం బాలు మామను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. జుక్కల్ మండలంలోని హంగర్గ గ్రామంలో శుక్రవారం బాలు మామ విగ్రహ ప్రతిష్ఠాపన, శిఖరస్థాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు కురుమ సంఘం పెద్దలు గొంగడితో సత్కరించారు. బీఆర్‌ఎస్ నాయకులు నీలూ పటేల్, బొల్లి గంగాధర్, వాసర్‌వార్ రమేశ్, విఠల్ పటేల్, సుధాకర్, నాల్చర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మామిడికాయలను ముక్కలు చేస్తూ జీవనోపాధి


మామిడి కాయలను ముక్కలు చేస్తున్న హసన్‌పల్లి వాసి భూమయ్య

ఎల్లారెడ్డి రూరల్, మే 9 : మామిడి కాయలను ముక్కలు చేస్తూ హసన్‌పల్లి గ్రామానికి చెందిన భూమయ్య ఉపాధి పొందుతున్నాడు. సీజనల్ పనులు చేస్తూ జీవనాన్ని కొనసాగించే భూమ య్య ప్రస్తుతం పచ్చళ్ల సీజన్ కావడంతో ఎల్లారెడ్డి పట్టణంలో మామిడి కాయలను ముక్కలు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఒక్క కాయ ముక్కలు చేస్తే రెండు రూపాయల చొప్పున తీసుకుంటానని, రోజుకు వెయి, పదిహేనువందల రూపాయలు పచ్చళ్ల సీజన్‌లో సంపాదించుకుంటానన్నాడు.

## సహకార సంఘం సీఈవోకు సన్మానం

లింగంపేట, మే 9 : మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి గ్రామ సహకార సంఘం సీఈవో శ్రీనివాస్‌కు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డీజీఎం లింబాద్రి శాలువా కప్పి సన్మానించారు. శెట్పల్లి సహకార సంఘం పరిధిలో తక్కువ గ్రామాలు ఉన్నప్పటికీ రెండు కోట్ల 10 లక్షల రూపాయలు వసూలు చేసినట్లు ఆయన తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో అధిక శాతం రుణాలు వసూలు చేసినందుకుగాను లింగంపేట సహకార బ్యాంకులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో నాగభూషణం, స్థానిక బ్యాంకు మేనేజర్ కుమార స్వామి, ఫీల్డ్ అధికారి రాకేశ్ తదితరులు ఉన్నారు.

## చిత్ర లేఖనంపై శిక్షణతో ఉపాధి అవకాశాలు

లింగంపేట, మే 9 : చిత్ర లేఖనం ద్వారా ఉపాధి అవకాశాలు కలుగుతాయని డ్రాయింగ్ మాస్టర్ ఖాసీం విద్యార్థులకు సూచించారు. వేసవి శిక్షణ శిబిరంలో శుక్రవారం చిత్ర లేఖనంపై అవగాహన కల్పించారు. చిత్ర లేఖనంలో తీసుకోవాల్సిన మెళకువలను విద్యార్థులకు వివరించారు. గోడలపై రాతలు, బొమ్మలు గీయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణ శిబిరంలో 130 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**డాక్యుమెంట్ పోయినది**

★నేను KATURU JAYABABU S/o. KUTURU RAJESHWAR R/o. H.No.4-5-44 అంబర్‌పేట్, జవహర్‌రోడ్, నిజామాబాద్ నా యొక్క ఒరిజినల్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.14022/2019 తేది:13.12.2019 గలది. తేది: 06-05-2025 నాడు జిల్లా కోర్టు నిజామాబాద్ నందు నిలిపివుంచిన నా బైక్ కవర్‌లో నుండి ఎక్కడో పడిపోయినది. కావున దొరికినవారు సంప్రదించు నెం.9966818444.
NTZ-330019

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## విద్యార్థినికి సన్మానం


ఇందూను సన్మానిస్తున్న సామాజిక ఆశయ సాధన సమితి సభ్యులు

బాన్సువాడ, మే 9 : ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో 957 మార్కులు సాధించి, బాన్సువాడ డివిజన్ టాపర్‌గా నిలిచిన పట్టణానికి చెందిన విద్యార్థిని గైని ఇందూను సామాజిక ఆశయ సాధన సమితి, దళిత సంఘం సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సామాజిక ఆశయ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సందుల గంగారాం, అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగా రు మైశయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ నర్సింహులు, అంబేద్కర్ సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు గైని రవి తదితరులు పాల్గొన్నారు.

## బాలికల విద్య కుటుంబానికి పునాది

ఎల్లారెడ్డి రూరల్, మే 9 : బాలికల విద్య కుటుంబానికి పునాదిలాంటిదని తెలంగాణ టీచర్స్ యూనియన్ అధ్యక్షుడు ముజీబుద్దీన్ వెల్లడించారు. ఎల్లారెడ్డి మండలం కొట్టాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 6 నుంచి 14 ఏండ్లలోపు పిల్లలను కచ్చితంగా పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. బాలికలకు ఉన్నత చదువులు చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన బోదాస్ లావణ్య, బోదాస్ స్నేహా, ద్యావల్ల శ్రీలత, ఇంటర్మీడియెట్‌లో ఉత్తీర్ణత సాధించిన దేవికృపను శాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు బోదాసు సాయిరాం, గ్రామస్తులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

రాజంపేట్, మే 9 : గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించే లక్ష్యంతో ఎస్బీఐ సౌజన్యంతో గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని మండల కేంద్రంలో గత నెలలో ప్రారంభించారు. ఈ శిక్షణలో భాగంగా సబ్సిడీతో రూ.6,500లకు కుట్టు మిషన్‌ను 25 మంది శిక్షకులకు గ్రామ స్వరాజ్య సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వెంకటలక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రఘురాం మాట్లాడుతూ.. సబ్సిడీ ద్వారా అందిస్తున్న కుట్టుమిషన్లను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజా స్వరాజ్య సంస్థ మండల కోఆర్డినేటర్ పద్మ, పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్రమ శిక్షణ కలిగి ఉండాలి

లింగంపేట, మే 9 : ప్రతి యువకుడు క్రమశిక్షణ కలిగి ఉండాలని ఆర్ఎస్ఎస్ జిల్లా సహ కార్యవాహ్ వల్లకాటి సాయినాథ్ సూచించారు. లింగంపేటలో మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రారంభిక శిక్ష వర్గ ముగింపు సమావేశంలో పాల్గొన్నారు. ఈ శిక్షణ శిబిరంలో అవగాహన కల్పించిన అంశాలను నిత్యం పాటించాలని సూచించారు. దేశ భక్తి, సోదర భావం కలిగి ఉండాలన్నారు. నిత్యం శాఖకు వెళ్లడంతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని వెల్లడించారు. గ్రామాల్లో చిన్నారులు, యువకులతో నిత్యం సూర్యనమస్కారాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో తాడ్వాయి, ఎల్లారెడ్డి, లింగంపేట ఖండాలకు చెందిన యువకులు పాల్గొన్నారు.

## దరఖాస్తులు బ్యాంకర్లకు అప్పగింత

లింగంపేట(తాడ్వాయి), మే 9 : రాజీవ్ యువ వికాస్ పథకంలో వచ్చిన దరఖాస్తులను వివిధ బ్యాంకర్లకు అప్పగించినట్లు మండల ప్రత్యేకాధికారి రాజారాం తెలిపారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. బ్యాంకు సర్వీసు పరిధిలోని గ్రామాలకు సంబంధించిన దరఖాస్తులను ఆయా బ్యాంకు అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

బ్యాంకు అధికారులు దరఖాస్తులు పరిశీలించి అర్హులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక అధికారి వెంట మండల పంచాయతీ అధికారి సవితతోపాటు ఆయా బ్యాంకుల అధికారులు ఉన్నారు.